క్లుప్తంగా

భాస్కర్‌రావు కృతజ్ఞతలు

మిర్యాలగూడ : పట్టణంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షో విజయవంతం చేయడంపై బీఆర్‌ఎస్ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని పట్టణంతోపాటు మాడ్గులపల్లి, వేములపల్లి, మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల నుంచి రోడ్ షోకు భారీగా హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు, రైతులతోపాటు ఆయా వర్గాల ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా వెంకటేశ్‌గౌడ్



వెంకటేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : కాంగ్రెస్ వికలాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా రాయిన పాలెంగ గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్‌ను నియమిస్తూ సోమవారం ఆ విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలను వికలాంగులకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకవచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కమిటీ తనపై ఉన్న నమ్మకంతో ఈ పదవిని అప్పగించిందని, దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. నియోజకవర్గంలోని అన్నీ గ్రామాలను పర్యటించి రానున్న ఎన్నికల్లో వికలాంగులు కాంగ్రెస్ పార్టీ గెలిపించేందుకు సిద్ధం చేస్తానని అన్నారు. తన నియమకానికి అన్నీ విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ చంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి దేవాలయ సముదాయంలో సోమవారం దాత దేవాలయ అర్చకులు ఘంటసాల గాయత్రిశివప్రసాద్‌శర్మ, హర్షల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాసం సోమవారం పురస్కరించుకొని అయ్య ప్ప మాలాధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాత దాత దంపతులను అయ్యప్పమాలాదారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలాదారులు చిట్టడి ప్రభాకర్‌రెడ్డి గురుస్వామి, గణేశ్, కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దు

మాడుగులపల్లి : కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, అభివృద్ధి.. సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆదరించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నిమ్మల నవీన్‌రెడ్డి కోరారు. మండలంలోని ఇసుకబాయిగూడెంలో బీఆర్‌ఎస్ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు మద్దతుగా సోమవారం ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోవిందమ్మ, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు టీడీపీ మద్దతు

నాగార్జునసాగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డికే టీడీపీ మద్దతు అని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓట్లు వేయాలని నియోజకవర్గం ఇన్‌చార్జ్ మువ్వఅరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక విజయవిహార్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉడుతూరు నరసింహారెడ్డి,సైదయ్య,మంద తిరుపతయ్య, సుబ్బు బలరాం రెడ్డి, షేక్ జమీల్,జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు తుమ్మురుగోటి వెంకన్న,బండారునారాయణ,నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

మిర్యాలగూడ టౌన్ : సూర్యాపేట బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పోలీసు అధికారులను కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట నియోజకవర్గంలో బీసీ బిడ్డకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అగ్రకులాల దురహంకారంతో ఓడిపోతామనే భయంతో దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సూర్యాపేట నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం గట్టికల్లు గ్రామంలో ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహిస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు వట్టె జానయ్య యాదవ్‌పై గొడ్డళ్లు, కత్తులతో దాడులను చేశారని ధ్వజమెత్తారు. దాడి చేసిన వారు ఎంతటి వారు అయినా వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, సాయిరాం, నాగరాజు, సునిల్, రాంబాబు తదతరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అందరికి భరోసా

- నాగార్జునసాగర్ అభ్యర్థి నోముల భగత్



హాలియా : గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భగత్

హాలియా : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు గోస పడాల్సి వస్తుందని, అదే బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే అందరికి భరోసా ఉంటుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల భగత్ అన్నారు. సోమవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనుముల మండలంలోని పాలెం, పెద్దవూర మండలంలోని పర్వేదుల గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భగత్, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, ఆప్కాబ్ మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీలో చేరిన వారికి బీఆర్‌ఎస్ కండువాలు కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, వివిధ మండలాల అధ్యక్షులు కూరాకుల వెంకటేశ్వర్లు, జటావత్ రవినాయక్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బషీర్, మైనార్టీ నాయకులు అబ్బాస్, యూత్ అధ్యక్షుడు మెండె సైదులు, నడ్డి సత్యం పాల్గొన్నారు.

ఆదరించి గెలిపిస్తే.. మరింత అభివృద్ధి చేస్తా

పెద్దవూర : బీఆర్‌ఎస్ కారు గుర్తుపై ఓటు వేసి ఆదిరించి గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్, జెడ్పీటీసీ కృష్ణారెడ్డిలతో కలిసి మండలంలోని తెప్పమడుగు, లింగంపల్లి, పెద్దగూడెం, శిర్సనగండ్ల, కొత్తలూరు, బసిరెడ్డిపల్లి, వెల్మగూడెం, గర్నెకుంట, పిన్నవూర, సంగారం, బట్టుగూడెం గ్రామాల్లో ఎన్నిక ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే జానారెడ్డి ఈ ప్రాంతానికి ఏమి ఒరగబెట్టాడని ఓట్లు అడగటానికి వస్తున్నాడన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. అలాగే మండలంలోని పర్వేదుల, గర్నెకుంట గ్రామాలకు చెందిన పలువురు భగత్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువాలను కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అలాగే పెద్దగూడెం గ్రామంలోని కోదండరామాలయంలోని ధ్వజస్తంభానికి మొక్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ్మడపల్లి గ్రామంలో సైతం దేవుడికి గుమ్మడికాయను కొట్టాడు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవినాయక్, మునిరెడ్డి, మాజీ ఎంపీపీ అంతయ్య, నాయకులు విష్ణువర్ధన్ రావు, వివేకరావు, కర్ణ బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవూర : తమ్మడపల్లిలో గుమ్మడికాయ కొడుతున్న ఎమ్మెల్యే భగత్



పెద్దవూర : భగత్‌కు బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

భారీ మెజార్టీతో భాస్కర్‌రావును గెలిపించాలి



సిద్ధార్థ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మాజీ ఎంపీటీసీ పద్మరమణయ్య

మిర్యాలగూడ : ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో భాస్కర్ రావును గెలిపించాలని బీఆర్‌ఎస్ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ అన్నారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ మాజీ ఎంపీటీసీ చిరుమర్రి పద్మరమణయ్య సోమవారం పట్టణంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ కట్టా మల్లేష్‌గౌడ్, జెడ్పీటీసీ ఇరుగు మంగమ్మవెంకటయ్యల ఆధ్వర్యంలో సిద్ధార్థ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సిద్ధార్థ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మిర్యాలగూడ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వేములపల్లి గ్రామ సర్పంచ్ చిరుమర్రి మల్ల య్యయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు నక్క నాగరాజు, చిరుమర్రి నాగయ్య, చిరుమర్రి ప్రభాకర్, నక్క పురుషోత్తం, విజయ్, రాము, పాల్గొన్నారు.

బీజేపీకి పట్టం కట్టడం ఖాయం



వెంకటంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న లాలునాయక్, కార్యకర్తలు

చింతపల్లి : తెలంగాణలో ప్రజలు బీజేపీ పట్టం కట్టడం ఖాయమని దేవరకొండ బీజేపీ అభ్యర్థి కేతావత్ లాలునాయక్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిధిలోని వెంకటంపేట, నెల్వలపల్లి, ఉప్పరపల్లి, తిరుమలాపురం, నసర్లపల్లి, గగ్గాయినిపాలెం, హోమంతాలపల్లి, అనాజిపురం, జర్పులతండా, వింజమూరు, వర్కాల, గడియగౌరారం, మాన్‌సింగ్‌తండా, బొత్యతండా, రాజ్యతండాలతో పాటు మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనలో దేవరకొండ నియోజకవర్గానికి ఒరిగిందేమి లేదన్నారు. తనకు ఒక్క అవకాశమిస్తే నియోజకవర్గ అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికలతో రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ పాలన అంతంకానుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాష్ట్ర అధికార ప్రతినిధి కల్యాణ్‌నాయక్, జిల్లా ఇన్‌చార్జ్ ప్రదీప్, రాములు, శివర్ల మేశ్‌యాదవ్, సముద్రాల నగేశ్, శ్రీనివాస్, శ్రీనివాస్, ధరణిపతి రమణారావు, మహేశ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పంపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి



బంగారుగడ్డలో రంగారెడ్డి ప్రచారానికి హాజరైన సీపీఎం శ్రేణులు, ప్రజలు

- మిర్యాలగూడ సీపీఎం అభ్యర్థి రంగారెడ్డి

మిర్యాలగూడ : పేద ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో ఓడించి ఫామ్ హౌస్‌కు పంపాలని సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని బంగారుగడ్డలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు రంగారెడ్డికి ఎదురెళ్లి పూలమాల వేసి హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల దొంగలు వస్తున్నారని వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పదేళ్లుగా స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని పట్టించుకోకుండా సొంత పనులకు అధికారాన్ని ఉపయోగించుకుంటున్నారన్నారు. రియల్‌ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ భూములను కాజేసి కోట్ల రూపాయలు దండుకుంటున్నట్లు ఆరోపించారు. ఏ రోజూ ప్రజల కోసం పనిచేయలేదని, కనీసం ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. వార్డు కౌన్సిలర్‌గా గెలిపిస్తే ఆ వార్డును చూసిన పాపాన పోలేదని ఆరోపించారు. కౌన్సిలర్‌గా ప్రజా సమస్యలను పట్టించుకోని ఆ నాయకుడిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏం చేస్తాడని ధ్వజమెత్తారు. వాళ్లను గెలిపిస్తే అసెంబ్లీలో చివరి బెంచీలో కూర్చొంటారని, అదే తనను గెలిపిస్తే ప్రతిపక్ష నాయకుడిగా ముందు బెంచీలో కూర్చొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. పదవుల కోసమే రాజకీయం చేస్తున్నారని దాని కోసం ఎప్పుడు ఎవరూ ఏ పార్టీని మారెందుకు వెనుకాడరని, అలాంటి నాయకులను ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్, కార్యదర్శులు బావండ్ల పాండు, మల్లు గౌతంరెడ్డి, బీబమ్మ, మల్లయ్య, శ్రీను, వెంకటేశ్వర్లు, అనిల్ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో ఎర్రజెండా ఎగరడం ఖాయం

అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడలో ఎర్రజెండా ఎగరడం ఖాయమని సీపీఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం మిర్యాలగూడలో ఎన్నికలు ధన బలానికి, ప్రజాబలానికి మధ్య జరగుతున్నాయన్నారు. పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్న భాస్కర్‌రావు నియోజకవర్గ అభివృద్ధి ఎం చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. కౌన్సిలర్‌గా పనికిరానికి వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏం చేస్తాడో మీరే అర్థం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతంరెడ్డి, పాండు, రామ్మూర్తి, పరుశురాములు, రామ్మూర్తి, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు

- నాగార్జునసాగర్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి



త్రిపురారం : జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న గజలాపురం బీఆర్‌ఎస్ కార్యకర్తలు

హాలియా : కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు మేలు జరుగుతుందని నాగార్జునసాగర్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్‌కుమార్ సాగర్ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా అనిల్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు చేయలేదన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, రావుల రాంబాబు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి గెలుపునకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు సోమవారం హాలియా పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని పలు వార్డుల్లో తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ గౌడ్, వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు లింగారెడ్డి, గౌనీ రాజారమేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే

త్రిపురారం : మారుమూల ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో సాధ్యమవుతుందని నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బడాయి గడ్డ, డొంక తండా, రూప్లా తండా, అప్పలమ్మగూడెం, బొర్రాయి పాలెం, రాజేంద్ర నగర్, అల్వాల పాడు, చెన్నాయిపాలెం, సత్యంపాడు తండా, వస్రాంతండా, చౌళ్ల తండా, మాటూర్ గ్రామాల్లో అన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రాచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో జైవీర్ రెడ్డి మాట్లాడారు. అలాగే మాడుగుల పల్లి మండలంలోని గజలాపురం బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి సోమవారం నాగార్జున సాగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్ రెడ్డి సమక్ష్యంలో త్రిపురారం మండలంలోని రూప్ల తండాలో ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గోపగాని మాధవి, మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, ఎంపీపీ పాండమ్మ, జెడ్పీటీసీ భారతీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, ఎంపీపీ గౌరవ సలహాధారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ నామ రాజు, కసిరెడ్డి నరేష్, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



త్రిపురారం : జైవీర్‌రెడ్డి, రఘువీర్ రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు



హాలియా : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జైవీర్‌రెడ్డి

కరాటే క్రీడాకారులకు మెడల్స్



మెడల్స్ అందుకుంటున్న క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నిర్వహించిన 3వ జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియా క్రీడాకారులు మెడల్స్ సాధించారు. ముగ్గురు క్రీడాకారులు గోల్డ్‌మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అంతర్జాతీయ రెఫ్రీస్ ఎస్.లక్ష్మి, బూడిద సైదులు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

కాంగ్రెస్ హయాంలోనే దేవరకొండ అభివృద్ధి

- కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్



దేవరకొండ : వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బాలునాయక్

దేవరకొండ, చింతపల్లి : కాంగ్రెస్ హయాంలోనే దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, దేవరకొండ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలోని పలు వార్డుల్లో, చింతపల్లి మండలంలోని కుర్రంపల్లి, సాయిరెడ్డిగూడెం, మోద్గులమల్లేపల్లి, పికె.మల్లేపల్లి, కిష్టరాయునిపల్లి, రాయిగూడెం, వర్కాల, ధైర్యపురితండా, వింజమూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే దేవరకొండకు ఆర్డీఓ కార్యాలయం మంజూరు చేయించడంతో పాటు దేవరకొండకు ప్రభుత్వ ఆస్పత్రి వందపడకలుగా అప్‌గ్రేడ్ అయిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో దేవకొండలో నాయకులు శ్రీను, గౌరిశంకర్, వెంకటయ్య, నర్సింహ, చింతపల్లిమంలంలో సంజీవరెడ్డి, అంగిరేకుల నాగభూషణం, ముచ్చర్ల యాదగిరి, శ్రీనివాస్, ఆర్ఎస్.ప్రసాద్, శ్రీశైలం, విజయ్‌కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ



రిత్విక్‌ను అభినందిస్తున్న స్కూల్ చైర్మన్ వరప్రసాద్

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 16న సికింద్రాబాద్ ఎన్టీపీసీ లిమిటెడ్ ఏ గవర్నమెంట్ ఆఫ్ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలబాలికల చిత్రలేఖనం పోటీలో పట్టణ కేంద్రానికి చెందిన లోటస్‌స్కూల్‌కు చెందిన విద్యార్థి రిత్విక్ రెడ్డి ఉత్తమ ప్రతిభను కనబర్చాడు. రిత్విక్‌రెడ్డి వేసిన 'సేవ్ ఎర్త్' అనే అంశంపై చిత్రలేఖనం వేసినందుకు ఈ విద్యార్థికి బహుమతి కింద రూ.7500, సర్టిఫికేట్ కింద రూ.2వేలతో పాటు మెమొంటోను అందజేశారు. ఈ రాష్ట్ర స్థాయి చిత్రలేఖనంలో ప్రతిభను కనబరిచిన రిత్వీక్‌రెడ్డిని సోమవారం లోటస్ హైస్కూల్ చైర్మన్ బొడ్డుపల్లి వరప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ సుష్మా, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, చి త్రకారుడు యినుగుర్తి విజయ్‌కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

హెచ్‌ఎం రాములుకు సన్మానం



బదిలీపై వెళ్తున్నహెచ్‌ఎం రాములును సన్మానిస్తున్న ఎంఈఓ తరి రాము, టీచర్లు

గుర్రంపోడు : మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా కోదాటి రాములు అందించిన సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి తరి రాము అన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన రాములకు సోమవారం పాఠశాలలో హెచ్‌ఎం రాములుకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాములును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యాదగిరి, పీఆర్‌టీయూ నాయకులు అన్నపురెడ్డి, శ్రవణ్‌కుమార్, మురళీమోహన్ రెడ్డి, యూటీఎఫ్ నాయకులు మధుసూదన్, నాగయ్య, కాంప్లెక్స్ టీచర్లు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : కేసుల సత్వర పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతనంగా బాధ్యతలను స్వీకరించిన మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షుడు జి.వేణు అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాగతోపాన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా నూతనంగా బాధ్యతలను స్వీకరించిన వేణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి వాకిటి శ్రీనివాస్‌తో పాటు న్యాయవాదులు పుష్పగుచ్ఛం అందజేశారు. బెంచ్ అండ్ అసోసియేషన్ సమన్వయంతో పని చేసి కక్షిదారులకు సత్వర, సమాన న్యాయం అందించేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సినియర్ సివిల్ జడ్జి బి. సుజయ్, జూనియర్ సివిల్ జడ్జి ఏ.స్వర్ణలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీఎస్ఎన్ సుమబాల, బార్ అసోసియేషన్ సభ్యులు పవన్‌కుమార్, మల్లేష్, కొంక వెంకన్న, సీహెచ్‌వీడి ప్రసాద్, డి. రాజశేఖర్, కె. రామకృష్ణ, ఆర్ సైదులుతో పాటు జూనియర్, సినియర్ న్యాయవాదులు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

డిండి : గడిచిన తొమ్మిదిన్నరేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని మరోసారి గెలిపిస్తాయని ఆ పార్టీ దేవరకొండ అభ్యర్థి రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దాసరినెమలిపూర్, ఖానాపూర్, టి.గౌరారం, దేవత్‌పల్లితండా, బూరాన్‌పూర్, చెర్కుపల్లి, గద్రాల్‌తండా, శేషాయికుంట, హజ్యతండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించార. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవేందర్‌రావు, ఎంపీపీ సునీతా జనార్ధన్‌రావు, ఆ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ నాగార్జున్‌రెడ్డి, శ్రీనివాసారావు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక మాసం పూజలు

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి గ్రామంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు వెల్లటూరి రాంమోహన్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, రుద్రాబిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో భాగంగా మహిళలు తెల్లవారు ఝాము నుంచి ఆలయానికి వచ్చి దీపాలను వెలిగించి పూజలను నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

రోడ్లపైనే ఇసుక ట్రాక్టర్ల పార్కింగ్



సాగర్ రోడ్డు వద్ద రోడ్డుపైన నిలిపిన ఇసుక ట్రాక్టర్లు

నల్లగొండ క్రైం : నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్లను రోడ్డుపై నిలపడంతో ఇతర వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఆన్‌లైన్ ఇసుక బుక్ చేసిన వారి ఇంటి వద్దకు వెళ్లకుండా ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు దళారులతో కలిసి బేరం కుదిరిన తర్వాత ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు అక్కడి నుంచి వెళ్తున్నారు. రోడ్లపైనే ఎక్కువ సమయం ఇసుక ట్రాక్టర్లను నిలుపుతుండడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లకు ఇబ్బందిగా మారింది. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు అకస్మాత్తుగా యూటర్న్ తీసుకుంటుండడంతోపాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారు. ఇసుక ట్రాలీలు సక్రమంగా లేకపోవడంతో దారి పొడువునా ట్రాక్టర్ నుంచి ఇసుక కింద పడి వెనుక నుంచి వచ్చే వాహనదారుల కళ్లల్లో పడుతోంది. దీంతో వాహనాలు అదుపు తప్పి కిందపడుతున్నారు. ఇసుక ట్రాక్టర్లను రోడ్లపైన నిలుపుతున్నప్పటికీ పోలీస్‌లు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.